కారాగార ద్వాత్రింశతి



## జైలుగీతాలు

హోచిమిన్

ఆరుద్ర

### 5. జీవనమార్గం దుష్కరం

ఎత్తయిన కొండలను ఎక్కి దిగినాక
ఎట్లు మాగాణిలో పోని నూహింతు
పర్వతమ్ముల పులుల బాధ నే పడలేదు
పల్లమందును మనిషి బంధించె నన్ను.

ప్రముఖ చైనీయుని సముఖాని కేగు
ప్రజల వియత్నాము ప్రతినిధి నేను
సడిలేని బాటలో జడివాన రేగె చెరసాల
అతిథిగా చెందె గౌరవము.

### 6. ఉదయం

గోడపై తోచేటి ఉదయ భాస్కరుడు
వాడి కిరణాలతో చెరతలుపు తట్టు
బీగాలు మాత్రమూ బిగిసికొనిపోవు
చెరలోని కొట్లలో చీకట్లు మిగులు
బంధితులకందరకు బాగుగా తెలుసు
బాల భాస్కర కాంతి బయటనే వెలుగు

### 7. అపరాహ్ణం

అపరాహ్ణమున రెండు యామాల పిదప
విశ్రుభ పవనాల వీచికల కొలకు
చెరకొట్ల తలుపులు తెరచి వేస్తారు
ప్రతిఒక్కరు తలనెత్తి పరికింత్రుసనభము
స్వాతంత్ర్య గగనాన చరియించునట్టి
స్వేచ్ఛాధి దేవతల చెప్పుడీమాట?
తెలియునా నేడు మీ తీరు మానవులు
కారాగృహాలలో కనలుతున్నారు.

తెలుగు కళాసమితి, న్యూజెర్సీ ఉగాది మినీ కథల పోటీలో
రు. 300 గెలుచుకున్న రచన

# "మమ్మీ... నాకు అమ్మ కావాలి"

● కంచుమర్తి వెంకటేశ్వరరావు

నీలిమ తదేకంగా చూస్తోంది. ఆరేళ్ళు కూడా నిండని ఆ కళ్ళకు ఆ దృశ్యం వింతగా వుంది. ఏదో తెలియని, తను ఎన్నడూ అనుభవించలేని ఆ అనుభూతి చాలా అందంగా వుంది. ప్రతీరోజూ అదే సమయానికి గేటు దగ్గర నిలబడి చూస్తుంది ఆ దృశ్యాన్ని.

నగరంలో అతి ఖరీదైన కాన్వెంటు స్కూలది. ధనవంతుల పిల్లలు తప్ప మధ్య తరగతి పిల్లలు ముచ్చటపడి గదుల అందాన్ని కూడా చూసే అర్హత లేదనడానికి నిదర్శనంగా ఉదయం, సాయంత్రం కార్లు బార్లు తీర్చి వుంటాయి. పేదరికం, ఆకలి... ఈ పదాలంటే ఏమిటో తెలియని ఆ పిల్లలు ఖరీదైన బట్టలతో, అందంగా, బొద్దుగా, ఆరోగ్యంగా నిగనిగలాడుతుంటారు.

నీలిమను చూడగానే చెప్పవచ్చు బాగా డబ్బున్న గారాల కూన అని.

నెలరోజుల క్రితం నీలిమ కళ్ళకు ఆ దృశ్యం కనిపించింది.

గేటుకు దూరంగా ఓ స్త్రీ... చింపిరి జుట్టుతో, చిరిగిన గుడ్డలతో ఆమె కాన్వెంటు పిల్లల క్యారేజీలలో మిగిలిన అన్నం, టిఫిను ఆయా ఇస్తుంటే ఆత్రుతగా, ఆనందంగా అందుకుని ఒడిలో వున్న ఆరేళ్ళ కుర్రాడికి తినిపించడం... అన్నం నోట్లో పడగానే ఆ కుర్రాడు ఆమె ఒడిలో చిందులేస్తున్నాడు. అన్నం తిన్న తర్వాత గోళీ కాయలతో ఆడుకోవడం...

ఆ రోజు నీలిమ దగ్గరగా వెళ్ళింది.

"నువ్వు రోజూ ఇక్కడే అన్నం తింటావా"

కుర్రాడు కళ్ళప్పగించి చూశాడు... రోజూ చాలా మంది పాపలను చూస్తున్నాడు కానీ తన దగ్గరకు ఎవరూ రారు... ఈ రోజు... ఖరీదైన నీలిమ గౌనును, చిరిగిన తన నిక్కరును మర్చి మార్చి చూశాడు.

"నీ బట్టలు బ్లాక్‌గా వున్నాయి"

"అమ్మ కొనలేదు మరి" దిగులుగా అన్నాడా కుర్రాడు.

నీలిమ ఏదో కొత్తపదం మొదటిసారిగా విన్నంత ఆశ్చర్యంగా చూసింది.

"అమ్మ ఎవరు?" అమ్మ అనే పదానికి అర్థం తెలుసుకోవాలన్నంత తపనగా అడిగింది.

"అమ్మ నాకు అన్నం తినిపిస్తుంది, ఆడిస్తుంది, గోళీలు కొంటుంది... అదే మా అమ్మ. నీకు అమ్మ లేదా"

"నాకు అమ్మ లేదు... మమ్మీ వుంది. అన్నం రోజూ ఆయా తినిపిస్తుంది" అంది నీలిమ నిరాశగా.

ఆ రోజు నుండి నీలిమ లంచవరులో గేటు దగ్గరకు వచ్చి కుర్రాడికి అన్నం తినిపిస్తున్న అమ్మనే చూస్తుంది...

ఆ పసి మనసులో ఎన్నో ఆలోచనలు... తనకు అమ్మ ఎందుకు లేదు? ఆయా స్నానం చేయించి బట్టలు వేసి అన్నం తినిపిస్తుంది. మమ్మీ గుడ్ మార్నింగ్, గుడ్ నైట్ చెప్పినప్పుడు ముద్దు పెడుతుందంతే...

అమ్మ ఏదని మమ్మీని అడిగితే... అమ్మో... మమ్మీ కొడుతుందేమో! ఎలాగైనా సరే మమ్మీని అడగాలి తనకు అమ్మ ఎందుకు లేదని.

స్కూలు నుండి రాగానే మమ్మీ గదిలోకి వెళ్ళింది నీలిమ.

అప్పుడు డ్రెస్సింగ్ టేబిలు ముందు నిలబడి తన అందానికి మెరుగులు దిద్దుకుంటోంది అనుపమ. పాతిక సంవత్సరాలయినా పదహారేళ్ళ అమ్మాయిలా వుంది అనుపమ.

''వాట్ నీలిమా! కమాన్'' నీలిమను ఎత్తుకుని ముద్దులు కురిపించింది.

''మమ్మీ... నాకు అమ్మ లేదా''

కొరడాతో కొట్టినట్లయింది అనుపమకు... ''నేనే అమ్మను'' అంది నవ్వుతూ.

''షేవ్... నువు మమ్మీవి. అమ్మంటే అన్నం తినిపిస్తుందంట, ఆడిస్తుందంట. నాకు అమ్మ ఎందుకు లేదు మమ్మీ''



అనుపమ వింతగా చూసింది తన గారాల బంగారు బొమ్మను. ఈ రోజు ఇలా అడుగుతుందేమిటి?

''నీలిమా మమ్మీ అంటే అమ్మ''–నీలిమకు నచ్చచెప్పడానికి ప్రయత్నించింది అనుపమ.

ఆ చిన్నారి నీలిమ మనసుకు మమ్మీ జవాబు ఏ మాత్రం నచ్చలేదు. మమ్మీ అమ్మ ఎలా అవుతుంది... అన్నం తినిపించి ఆడించేది అమ్మ. అమ్మ అనే మాట తమఇంట్లో ఎప్పుడూ వినిపించ లేదే?

నీలిమలో ఎన్నో ప్రశ్నలు...

నీలిమ ఏది కావాలంటే అది క్షణాలలో ఇవ్వగలిగే అనుపమ ''మమ్మీ... నాకు అమ్మ కావాలి'' అనేదానికి జవాబు చెప్ప లేకపోతోంది.

రోజు రోజుకి నీలిమ పోరు ఎక్కువవుతోంది...

మొదటిసారిగా అనుపమ కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

''మమ్మీ... నాకు అమ్మ కావాలి'' నిద్రలో కలవరిస్తోంది నీలిమ.

అనుపమలో ఆలోచనలు మొదలయ్యాయి.

'నీలిమా... నేనే అమ్మను' అని ఎలా చెప్పాలి. ఎలా చెప్పగలదు తను. నెలల వయసులోనే ఆ బోసి నోటికి 'అమ్మ' బదులు మమ్మీ అని నేర్పించింది తనే. మాటలు రాగానే మమ్మీ అంది నీలిమ... అమ్మ అనే పదం రాలేదు ఎప్పుడూ!

తనెప్పుడూ నీలిమకు గోరు ముద్దలు తినిపించలేదు, ఆడించలేదు. అన్నం తినిపించి ఆడించేది అమ్మని నీలిమ అంటుంటే నేనే అమ్మని ఎలా రుజువు చేయాలి?

అమ్మా అనే పిలుపులోని మాతృత్వపు విలువ మొదటిసారిగా తెలిసింది అనుపమకు.

''నేనే అమ్మను. నన్ను అమ్మా అని పిలు'' అని గుండెలకు హత్తుకుంది అనుపమ నీలిమను. ఈ పసివయసులో తనను అమ్మగా భావించకపోతే కూతురు ఎక్కడ దూరమవుతుందోననే భయం...

అనుపమలో మార్పు... తనే నీలిమకు స్నానం చేయించి బట్టలు వేసి అన్నం తినిపించడం... సాయంత్రం అలా పార్కుకు తీసుకెళ్ళి ఆడించడం.

'అమ్మా...'అనుపమ నీలిమకు ఆ పదం వచ్చేలా చేస్తోంది.

ఆరు సంవత్సరాలలో ఎప్పుడూ పలుకని పదం ఇప్పుడు నీలిమ నోట్లోంచి రావడానికి ఎన్ని నెలలు పడుతుందో? తను చేసిన పొరబాటు దిద్దుకుంది అనుపమ. మరి నీలిమకు మమ్మీలో ఎప్పుడు అమ్మ కనిపిస్తుందో?

అనుపమకు ఇప్పుడు కావలసింది లక్షలు కాదు ''అమ్మా'' అనే పిలుపు.